సాక్షి
చిత్తూరు
బుధవారం : 19 : జూలై : 2023



వినాయకుని సేవలో సినీనటులు
కాణిపాకం వినాయకస్వామిని మంగళవారం సినీనటులు దర్శించుకున్నారు.
- 8లో



గంజాయిపై పోలీసుల దాడులు
జిల్లాలో పలు చోట్ల గంజాయి తరలిస్తున్న వారిని పోలీసులు పట్టుకున్నారు
- 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	34	26
తిరుపతి	35	27
తిరుమల	30	22
గూడూరు	36	29
నగరి	36	28

న్యూస్‌రీల్

దేశమ్మ ఆలయంలో ఆడిపూజలు



విశేష అలంకరణలో అమ్మవారు

నగరి : నేత్రప్రదాత శ్రీదేశమ్మ ఆలయంలో ఆడినెల పూజలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అభిషేక పూజల అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నివేదించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు అమ్మవారి తీర్థం కళ్లలో చల్లుకున్నారు. ఆలయం వద్ద పలువురు స్వచ్ఛందంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వేజుబాబు, ఈవో మునికృష్ణయ్య, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జవాన్‌కు అశ్రు నివాళి



జవాను మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు

పూతలపట్టు: పూతలపట్టు మండలం తోటవారిపల్లికి చెందిన ఆర్మీ జవాన్ హేమంత్ కుమార్(34)కు మంగళవారం గ్రామస్తుల అశ్రు నివాళుల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు. ఆదివారం చండీగఢ్‌లో విధినిర్వహణలో ఉన్న ఆయన అనారోగ్య కారణంగా మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం మృతదేహం గ్రామానికి చేరుకుంది. ఆయన మృతదేహాన్ని సందర్శించి ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు, మండలంలోని పలువురు నాయకులు, అధికారులు సంతాపం తెలిపారు. ఇంకా నివాళులర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ పెనుగొండ పరిశీలకుడు బాబురెడ్డి, పార్టీ కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, రాజారత్నంరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, పీఏ శ్రీనివాసులు, సర్పంచులు, అధికారులు తదితరులు ఉన్నారు.

ఉపాధిలో రూ.50లక్షలు అదనం



మాట్లాడుతున్న జిల్లా డ్వామా పీడీ గంగాభవానీ

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం) : వంద శాతం కూలీలకు పని కల్పించిన మండలాలకు ఉపాధి హామీ పథకం కింద రూ.50 లక్షలు అదనంగా నిధులు మంజూరవుతాయని డ్వామా పీడీ గంగాభవాని తెలిపారు. గంగాధరనెల్లూరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఎంపీపీ అనిత అధ్యక్షతన ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ జరిగింది. పీడీ మాట్లాడుతూ ప్రతి మండలంలోను వంద శాతం కూలీలకు పనులు కల్పించాలని ఆదేశించారు. గంగాధరనెల్లూరు మండలంలో 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 31 వరకు రూ.9.79 కోట్లు నిధులు ఖర్చు చేశారని తెలిపారు. మండలంలో 32 పంచాయతీలు ఉన్నప్పటికీ కూలీల సంఖ్య 1,596 ఉందని, వారంలోపు 3,200 మందికి సంఖ్యను పెంచాలని ఆదేశించారు. డీపీఓ భాగ్యలక్ష్మి, క్లస్టర్ ఏపీడీ సుబ్రమణ్యం, ఎంపీడీవో శ్రీదేవి, ఏపీఓ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీలు హరిబాబు, బేబీ పాల్గొన్నారు.

30న ఛత్రస్థాపనోత్సవం

తిరుమల : తిరుమలలోని నారాయణగిరిలో శ్రీవారి పాదాల చెంత ఈ నెల 30వ తేదీన ఛత్రస్థాపనోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అర్చక బృందం శ్రీవారి పాదాలకు తిరుమంజనం జరిపించనున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన గొడుగును ప్రతిష్ఠించి విశేష పూజలు చేపట్టనున్నారు.

పురాణ ప్రాశస్త్యం

సప్తగిరుల్లో అత్యంత ఎత్తయిన నారాయణగిరి శిఖరంపై కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామి వారు మొదటగా కాలు మోపినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా శ్రావణ శుద్ధ ద్వాదశినాడు ఛత్రస్థాపనోత్సవం నిర్వహిస్తుంటారు. ఈ ఉత్సవానికి మరో విశేషం ఉన్నట్లు పురాణాల్లో పేర్కొన్నారు. సాధారణంగా ఈ కాలంలో పెనుగాలులు వీస్తుంటాయి. నారాయణగిరి శిఖరం ఎక్కువ ఎత్తులో ఉండడంతో మరింత ఉధృతంగా గాలులు ఉంటాయి. వీటి నుంచి ఉపశమనం కల్పించాలని వాయుదేవుని ప్రార్థిస్తూ ఇక్కడ గొడుగును ప్రతిష్ఠిస్తారు. వందల ఏళ్లుగా ఛత్రస్థాపనోత్సవం జరుగుతోంది.

ఇటు సంక్షేమం.. అటు అభివృద్ధి

"పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి..
ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలి..
యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలి..
అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలి..
ప్రభుత్వ పథకాలను లబ్ధిదారు
ఇంటిముంగిటే చేర్చాలి.. అన్నదాతలు
ఆనందంగా జీవనం సాగించాలి..
ఆడపడుచులు ఆత్మగౌరవంతో ముందడుగు
వేయాలి.. దేశంలోనే మన రాష్ట్రం అగ్రపథాన
నిలవాలి.. అభివృద్ధి పనుల్లో ఆదర్శవంతంగా
పురోగతి సాధించాలి" ఇదే లక్ష్యంతో
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
పాలన సాగిస్తున్నారని
మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు.

- వైఎస్సార్‌సీపీ పాలనలో 1వ తేదీనే పింఛన్
- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు
- అవినీతికి కేరాఫ్ చంద్రబాబు
- పేదలకు అండగా వైఎస్ కుటుంబం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



లక్ష్మీపురం సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పంరూరల్ : రాష్ట్రంలో అభివృద్ధి.. సంక్షేమం సమపాళ్లలో అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం కుప్పం పట్టణంలో నిర్వహించిన రెండో రోజు వార్డు బాటలో ఆయన పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 6 సభల్లో ప్రసంగించారు. మంత్రి మాట్లాడుతూ కరోనా కష్టాల్లో రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా సీఎం వైఎస్ జగన్ వెనుకంజ వేయలేదని, ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పకడ్బందీగా సంక్షేమ పథకాలు అందించారని కొనియాడారు. ఓటుకు నోటు కేసులో చంద్రబాబు హైదరాబాదు నుంచి రాత్రికి రాత్రి తప్పించుకుని వచ్చి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆరోపించారు. ఓ వైపు అప్పులను సరిచేస్తూ, మరో వైపు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను కొనసాగిస్తూ సీఎం జగన్ పాలనా దక్షతను చూపించారన్నారు. 35 ఏళ్లుగా కుప్పం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న చంద్రబాబు ఇక్కడి ప్రజలకు చేసింది ఏమీ లేదని స్పష్టం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తన హయాంలో పులివెందులను అద్భుతంగా తీర్చిదిద్దారని, జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల కాలంలో వైఎస్సార్ కడప జిల్లాను మరింత అభివృద్ధి చేశారని వెల్లడించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలంటే వైఎస్సార్, వైఎస్ జగన్ మాత్రమే గుర్తుకువస్తారని వివరించారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంచన్‌గా పింఛన్ అందిస్తున్నామని చెప్పారు. కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే సీఎం వైఎస్ జగన్ 4లక్షల ఉద్యోగాలు సృష్టించారని వెల్లడించారు. చంద్రబాబు తన హయాంలో జన్మభూమి కమిటీలను తయారు చేసి ప్రజలను నిలువునా దోచుకున్నారని విమర్శించారు. విద్యావైద్య రంగాల్లో ప్రభుత్వం సమూల మార్పులు చేసిందన్నారు. సర్కారు బడులను కార్పొరేట్‌స్థాయిలో తీర్చిదిద్దిందని తెలిపారు. పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియంలో విద్యను అందిస్తోందని చెప్పారు. వైద్యరంగంలో త్వరలోనే 14వేల పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చంద్రబాబు మళ్లీ మోసపు హామీలకు తెరతీస్తున్నారని మండిపడ్డారు. అయితే చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని నారా లోకేష్‌కు మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించే స్థాయిలేదన్నారు. మాట ఇస్తే నెరవేర్చే మంత్రి పెద్దిరెడ్డి ముందు ఎప్పుడూ అబద్ధాలే వల్లించే చంద్రబాబు నిలబడలేరని వెల్లడించారు. పవన్‌కల్యాణ్, లోకేష్, చంద్రబాబు అవాకులు చెవాకులు మాట్లాడితే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇదే విధంగా వ్యవహరిస్తుంటే ప్రజలే మళ్లీ తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సుధీర్, రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, ఎంపీపీ అశ్విని, వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు శరవణ, కృష్ణమూర్తి, నితిన్‌రెడ్డి , నాయకులు నరేష్‌కుమార్‌రెడ్డి, మొగసాల కృష్ణమూర్తి, రెడ్డెప్ప పాల్గొన్నారు.



సభలకు హాజరైన జనం



ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పకడ్బందీగా ఆడుదాం ఆంధ్రా



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఆడుదాం ఆంధ్రాకు పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర అక్టోబర్ 2వ తేదీ నుంచి ప్రారంభం అవుతుందని చెప్పారు. ఇందుకు సన్నాహక ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. జిల్లాలో ప్రధానంగా ఆరు క్రీడలు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, మారథాన్‌లు నిర్వహించాలన్నారు. సచివాలయాల స్థాయిలో ఎంఈఓలు, పీఈటీలు ఈనెల 25 లోపు ప్రతి పాఠశాలను సందర్శించి అనువైన పరిస్థితులు, పరికరాల అంశాలపై పరిశీలించి నివేదికలను పంపాలని ఆదేశించారు. ఆగస్టు 5 లోపు క్రీడలకు షెడ్యూల్ సిద్ధం చేయాలన్నారు. జేసీ శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్, డీఆర్వో రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

- హుండీ ఆదాయం రూ.5.40 కోట్లు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 71,894 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 25,208 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.5.40 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేకుంటే దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఉపాధికి ఊతం

- జిల్లాలో 19,692 మంది లబ్ధిదారులకు రూ.21.21 కోట్ల వడ్డీలేని రుణాలు జమ
- జగనన్న తోడు కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి
- హాజరైన ఎమ్మెల్యే శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్



జగనన్న తోడు మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, ఎమ్మెల్యే శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జగనన్న తోడు పథకం అమలుతో రాష్ట్ర ప్రభుత్వం చిరు వ్యాపారులకు ఊతం కల్పిస్తోందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి నుంచి వర్చువల్ పద్ధతిలో ఈ పథకాన్ని ప్రారంభించారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. పాల్గొన్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ చిరువ్యాపారులకు, వీధి విక్రయదారులకు భరోసాగా అప్పుల ఊబి నుంచి కాపాడేందుకు ప్రభుత్వం పథకం అమలు చేస్తోందన్నారు. ఒక్కో లబ్ధిదారుడికి మూలధనంగా రూ.10,000 చొప్పున బ్యాంకు రుణం అందిస్తున్నారని, ఈ మొత్తాన్ని 12 కంతుల్లో సక్రమంగా చెల్లించిన వారికి మళ్లీ రుణాలను ఇస్తారని తెలిపారు. జిల్లాలో 19,692 మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ.21.21 కోట్లు ప్రభుత్వం జమ చేసిందన్నారు. జగనన్న తోడు ద్వారా గతంలో రుణాలు పొంది సక్రమంగా చెల్లించిన 16,677 మందికి రూ.24.26 లక్షలు వడ్డీ కింద జమ చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నవరత్నాలను ప్రవేశపెట్టి వాటిని అమలు చేయడంలో చరిత్ర సృష్టించారని తెలిపారు. విద్యను మించిన సంపద లేదని, విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

4వ ఏడాది మొదటి విడత..

కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ వరుసగా 4వ ఏడాది మొదటి విడతగా జగనన్న తోడు కింద జిల్లాలో గ్రామీణ ప్రాంతంలోని 14,358 మందికి రూ.15.16 కోట్లు, పట్టణ ప్రాంతాల్లోని 5,338 మందికి రూ.5.74 కోట్లు జమ అయినట్లు తెలిపారు. అనంతరం జగనన్నతోడు, వడ్డీ రీయింబర్స్‌మెంట్ మెగా చెక్కును ఉప ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్, చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు. ఈడిగ కార్పొరేషన్ చైర్మన్ శాంతి, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, జెడ్పీ మహిళా స్థాయి సంఘం చైర్మన్ భారతి, డీఆర్‌డీఏ పీడీ తులసి, ఎల్‌డీఎం హరీష్, ఇతర అధికారులు పాల్గొన్నారు

అన్నలా ఆదుకున్న జగనన్న



మునెమ్మ,లబ్ధిదారురాలు

అమ్మా నాన్న, అన్నదమ్ములు ఆదుకోక పోయిన సమయంలో అన్నగా ఆదుకున్న ముఖ్యమంత్రికి లబ్ధిదారాలు మునెమ్మ కృతజ్ఞతలు తెలిపారు. వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో గంగాధర నెల్లూరు మండలం జగనన్న తోడు లబ్ధిదారాలు మునెమ్మ మాట్లాడారు. ఆమె మాటల్లో 'కూలి పనులు చేసుకునే పేద కుటుంబం మాది. జగనన్న తోడు పథకానికి నేను అర్హురాలినని తెలిపి వలంటీర్లు దరఖాస్తు చేయించారు. జగనన్నతోడు ద్వారా మొదటిసారి అందిన రూ.10 వేల రుణంతో చీరలు, జాకెట్ల వ్యాపారం ప్రారంభించాను. రోజూ అమ్మకాలు పోనూ రూ.500ఆదాయం వచ్చేది. రుణాన్ని సక్రమంగా తిరిగి కట్టినందుకు ప్రభుత్వం వడ్డీని తిరిగి నాకు చెల్లించింది. రెండవసారి రూ.11,000 రుణం పొంది వ్యాపారాన్ని అభివృద్ధి చేశా. వ్యాపారం బాగా జరుగుతోంది. జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకుని సొంతింటి కలను నెరవేర్చుకున్నాను. చేయూతలో భాగంగా రూ.18,750 రెండు విడతలు మంజూరైంది. వైఎస్సార్ ఆసరా లబ్ధి పొందాను. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద నా భర్త వైద్యం పొందాడు. తల్లిదండ్రులు, తోబుట్టువులు పట్టించుకోని నాలాంటి వారిని ఆదుకుంటున్న సీఎం జగనన్నకు మహిళల తరఫున కృతజ్ఞతలు.

వడ్డీల బాధ తప్పింది



నేను, నా భర్త కూలి పని చేస్తూ జీవనం సాగించేవాళ్లం. జగనన్న తోడు మొదటిసారి లబ్ధి పొంది చిల్లర అంగడి ప్రారంభించాం. సకాలంలో చెల్లిస్తూ బ్యాంకులో రుణం పొంది నా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటున్నాను. అప్పుల బాధ తప్పింది. జగనన్నకు ధన్యవాదాలు.

– కె.నవనీత, చిత్తూరు రూరల్

ఆర్థిక ఇబ్బందులు తొలిగాయి



జగనన్న తోడు పథకం కింద పొందిన రూ.పదివేలతో స్నాక్స్ ఐటమ్స్ తయారు చేసి విక్రయిస్తున్నాం. గతంలో రూ.10,000 అప్పు తీసుకుంటే రూ.1000 పట్టుకొని అప్పు ఇచ్చే వారు. ఇప్పుడు ఆ బాధ తప్పింది. నాలాంటి వారిని ఆదుకుంటున్న జగనన్నకు కృతజ్ఞతలు

– షాహీనా 35వ డివిజన్, చిత్తూరు

ఐరాసా అవార్డు రేసులో 'ఆర్‌బీకే'



నిండ్ర మండలంలోని కొప్పేడులో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

- ఆర్‌బీకేని నామినేట్ చేసిన ప్రధాని మోదీ
- సీఎం జగనన్న పథకాలు దేశానికే ఆదర్శం
- పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు రూరల్: దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఐక్యరాజ్య సమితి అవార్డు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే) వ్యవస్థను నామినేట్ చేయడం దేశానికే గర్వకారణమని రాష్ట్ర పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా పేర్కొన్నారు. మంగళవారం నిండ్ర మండలం కొప్పేడులో, వడమాలపేట సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో మంత్రి పాల్గొన్నారు. వడమాలపేట కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మన పథకాలు ప్రపంచ ఖ్యాతికై పోటీపడడం తెలుగు ప్రజలందరూ గర్వించదగిన విషయమన్నారు. మహాత్మా గాంధీజీ కలలను సాకారం చేస్తూ జగనన్న సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి జనరంజక పాలన సాగిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో ఒక పని జరగాలంటే ధర్నాలు, రాస్తారోకోలు నిత్యం చూశామని, అదే నేటి ప్రభుత్వంలో పలు పథకాలు, పంపిణీ కార్యక్రమాలతో ప్రతి రోజూ పండుగలా ఉంటోందని చెప్పారు. వలంటీర్లు, గృహసారథులు, ఎమ్మెల్యేలు, మంత్రులు గడప గడపకు వచ్చి ప్రజల యోగక్షేమాలను తెలుసుకుని, సమస్యలను గుర్తిస్తూ పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్క వడమాల సచివాలయ పరిధిలో రూ. 12.65 కోట్ల సంక్షేమం, అభివృద్ధి జరిగిందని తెలిపారు. జగనన్న సురక్షలో 631 మందికి సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమపాళ్లలో అందిస్తున్న జగనన్నను మరోసారి సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా ఆశీర్వదించాలని కోరారు. జగనన్న సైనికురాలినైన తనను నగరి ఎమ్మెల్యేగా ముచ్చటగా మూడోసారి గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు మధుసూదనరెడ్డి, ప్రత్యేక అధికారి గీతారాణి, తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీడీఓ భానుమూర్తి, ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలతో చర్చలు



సదస్సులో వీసీ భారతి తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : అమెరికా, ఆస్ట్రేలియా దేశాల్లోని వివిధ విద్యాసంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడానికి ఆయా దేశాల అధికార ప్రతినిధులతో చర్చించినట్లు శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ డి.భారతి ఒక ప్రకటనలో తెలిపారు. హర్యానా రాష్ట్రం గుర్గావ్ ఐఐఎల్‌ఎం, అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ సంయుక్తంగా గత రెండు రోజులుగా నిర్వహించిన ఉన్నత విద్యా జాతీయ మహిళా వీసీల సదస్సు మంగళవారంతో ముగిసింది. ఈ సదస్సుకు మహిళా వర్సిటీ వీసీ హాజరయ్యారు. ఈ సందర్భంగా అమెరికా, ఆస్ట్రేలియా అధికార ప్రతినిధులతో అవగాహన ఒప్పందాలపై చర్చించామన్నారు.

ఎస్వీ ఓరియంటల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఎస్వీ ఓరియంటల్ డిగ్రీ కళాశాలలో ప్రీ డిగ్రీ(ఇంటర్), డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీటీడీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. రెండేళ్ల ప్రీ డిగ్రీలో సంస్కృతం, తెలుగు, హిందీ కోర్సులకు 18 ఏళ్ల లోపు వయసు గల ఎస్ఎస్‌సీ/తత్సమాన విద్యార్హత కలిగిన వారు, మూడేళ్ల సంస్కృతం, తెలుగు, హిందీ కోర్సులకు 21 ఏళ్లలోపు వయసు కలిగి ఇంటర్/తత్సమాన విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. కపిలతీర్థం రోడ్డులోని కార్యాలయంలో రూ.25 చెల్లించి దరఖాస్తులు పొందవచ్చన్నారు.

ఘనంగా ముగిసిన నృత్యోత్సవాలు



జ్ఞాపికలు అందుకుంటున్న కళాకారులు

తిరుమల : తిరుమల ఆస్థాన మండపంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న ఏడుకొండల నృత్యోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. శ్రీ సాయి నాట్యాంజలి ఫైన్‌ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ నంద్యాల వారి ఆధ్వర్యంలో దేశంలోని ఎనిమిది రాష్ట్రాల నుంచి వచ్చిన 700మంది కళాకారులు వివిధ నృత్యాలను ప్రదర్శించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పల్లంశెట్టి సురేష్ తెలిపారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



సభా స్థలిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న జేసీ డీకే బాలాజీ

వెంకటగిరి: వెంకటగిరిలో ఈనెల 21న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ నేతన్ననేస్తం ఐదో విడత నిధులు విడుదల కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో మంగళవారం ఏర్పాట్లను జేసీ డీకే బాలాజీ, ఏఎస్పీ కులశేఖర్ పరిశీలించారు. బహిరంగ సభ నిర్వహించే ప్రాంతంలో ఏర్పాట్లును పరిశీలించి గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, సంబంధిత అధికారులకు సూచనలు అందించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద ప్రత్యేక పోలీసు బలగాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి.

క్లుప్తంగా

వినాయకుని సేవలో సినీ నటులు



నందమూరి చైతన్య కృష్ణ కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని మంగళవారం సినీ నటులు దర్శించుకున్నారు. నటి కలర్స్ స్వాతి, బ్రీత్ చిత్రం హీరో నందమూరి చైతన్య కృష్ణ కుటుంబ సభ్యులు వేర్వేరుగా స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు.

యువకుడి ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరం ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన డేవిడ్ (19) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసు కథనం మేరకు.. తల్లిదండ్రులు చనిపోవడంతో కూలీ పనిచేస్తూ డేవిడ్ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం వెంగళరావు కాలనీలో ఉంటున్న తన అక్క ఇంటికి వెళ్లిన ఇతను.. ఇంట్లో ఎవరూలేని సమయంలో పైకప్పునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అనారోగ్య సమస్యలతోనే ఇతను ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి అక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మంగళవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు.

కరెంట్ షాక్‌తో ఆవు మృతి



బంగారుపాళెం : మండలంలోని పాలేరు వద్ద మంగళవారం కరెంటు షాక్‌తో ఆవు మృతి చెందింది. పీలేరు మండలం ఎర్రమరెడ్డిపల్లెకు చెందిన చెంచలయ్య కుటుంబ సభ్యులు ఊరూరా తిరుగుతూ గంగిరెద్దులు ఆడిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు బంగారుపాళెం మండలం పాలేరు సమీపంలో చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి పక్కన వారం రోజులుగా ఉంటున్నారు. మంగళవారం సాయంత్రం ఆవు మేత మేస్తూ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న ట్రాన్స్‌కో ఏఈ రామిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రభుత్వ పరంగా సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

సీజనల్ వ్యాధులపై సమరం

సీజనల్ వ్యాధుల వ్యాప్తి నివారణపై ప్రభుత్వం దృష్టిసారించింది. వైద్య, ఆరోగ్య శాఖను అప్రమత్తం చేస్తూ సీజనల్ వ్యాప్తి కట్టడికి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 50వ విడత ఇంటింటా ఫీవర్ సర్వేకు శ్రీకారం చుట్టింది. గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతూనే మరో వైపు సర్వే నిర్వహిస్తోంది. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లతో కూడిన బృందం ఇంటింటికీ వెళ్లి డెంగీ, మలేరియా, వివిధ జ్వరాలతో బాధ పడుతున్న వారిని గుర్తిస్తోంది. క్షేత్రస్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందేలా చూస్తోంది.

- శరవేగంగా ఇంటింటా ఫీవర్ సర్వే
- బాధితులను గుర్తిస్తున్న వలంటీర్లు, వైద్య బృందం
- అవసరమైతే ప్రత్యేక వైద్య శిబిరాలు
- పారిశుధ్యం మెరుగునకు చర్యలు
- ఇప్పటి వరకు 75.5 శాతం పూర్తి



చిత్తూరు : ఇంటింటా ఫీవర్ సర్వేలో వైద్య బృందం

చిత్తూరు రూరల్: జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు జిల్లా యంత్రాంగం సమరభేరి మోగిస్తోంది. ఇంటింటా ఫీవర్ సర్వే వేగవంతంగా సాగుతోంది. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమల బెడద పెరిగింది. మలేరియా, డెంగీ, బోదకాలు, డయేరియా వంటివి వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ వ్యాధులన్నింటికీ ముఖ్య లక్షణం జ్వరం కావడంతో.. ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టింది. జిల్లాలో ప్రతి ఇంటికీ వెళ్తున్న వైద్య సిబ్బంది జ్వరాలతో బాధ పడుతున్న వారి వివరాలు సేకరిస్తున్నారు. ఆ వివరాలను ఫీవర్ సర్వే యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఏ మాత్రం జ్వరం లక్షణాలు కనిపించినా మలేరియా, డెంగీ వంటి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. జ్వరం ఎన్ని రోజుల నుంచి ఉంది, ఇతర లక్షణా లేమిటో తెలుసుకుని, అవసరమైన వైద్య పరీక్షలు చేయించి, చికిత్స అందిస్తున్నారు. డెంగీ, మలేరియా వంటి జ్వరాలు వస్తే బాధితులకు వెంటనే వైద్య సేవలు అందించేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వైద్య సేవలను అందుబాటులో ఉంచారు. ఎక్కడైనా ఒకే ప్రాంతంలో ఎక్కువ మందికి జ్వరం ఉన్నట్టు గుర్తిస్తే ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి, వైద్య పరీక్షలు, వైద్య సేవలు అందించడంతో పాటు అక్కడ పారిశుధ్యం మెరుగుదలకు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ముందస్తు చర్యలతో సీజనల్ వ్యాధుల తీవ్రత తగ్గుముఖం పడుతోంది.

పారిశుధ్యానికి పెద్దపీట

క్లీన్ ఆంధ్రప్రదేశ్, జగనన్న స్వచ్ఛ సంకల్పం, ఆదర్శ గ్రామాలు, ఫ్రైడే డ్రైడే వంటి వినూత్న కార్యక్రమాలతో పారిశుద్ధ్యం మెరుగునకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. క్లాప్ ప్రోగ్రామ్ కింద ఇంటింటా చెత్త సేకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసింది. ఆదర్శగ్రామాల పేరుతో గ్రామ స్థాయిలో పారిశుధ్య పనులు పక్కాగా నిర్వహించడమే కాకుండా పచ్చదనానికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తూ దోమల నివారణకు చర్యలు చేపడుతున్నారు. చెరువుల్లో గంబూషియా చేపలు, నీటి నిల్వ ఉన్న కుంటల్లో ఆయిల్ బాల్స్ వంటివి వేస్తూ దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకుంటున్నారు. నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, ఆవాస ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహిస్తున్నారు.

డెంగీ కేసులు లేవు

జిల్లావ్యాప్తంగా 36 మండలాలు ఉండగా.. మొత్తం 5,82,032 కుటుంబాలు ఉన్నాయి. ఈనెల 11 నుంచి జిల్లాలో సర్వేను ప్రారంభించారు. ఈ సర్వేలో భాగంగా వలంటీర్లు, వైద్యబృందం ఇప్పటి వరకు 4,33,691 ఇళ్లను సందర్శించారు. 302 ఫీవర్ లక్షణాలు ఉన్నాయని గుర్తించారు. ఇందులో 257 మందికి ఫీవర్ పరీక్షలు చేశారు. వీరిలో ఏ ఒక్కరికి కూడా డెంగీ, మలేరియా వంటివి లేవని నిర్ధారించారు. సాధారణ జ్వరాలుగా గుర్తించిన వైద్యులు మందులు, మాత్రలు అందించి పర్యవేక్షణలో ఉంచారు. మరో పది రోజుల పాటు సర్వే కొనసాగుతుందని, ఇప్పటి వరకు 75.5 శాతం పూర్తయిందని అధికారులు లెక్కలు చెబుతున్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉండాలి



వ్యాధుల వ్యాప్తిని ముందస్తుగా గుర్తించి..వాటి కట్టడికి ప్రభుత్వం ఫీవర్‌ను చేయిస్తోంది. ఈ సర్వేకు ప్రజలు సహకరించాలి. ఇంట్లో, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలి. ఏమాత్రం నిర్లక్ష్యం వద్దు. –డాక్టర్ ప్రభావతిదేవి, డీఎంఅండ్‌హెచ్‌ఓ

పారిశుద్ధ్యంపై అవగాహన



ఫీవర్ సర్వేను వలంటీర్లు, వైద్య సిబ్బంది విధిగా చేయాలి. యాప్‌లో ఇచ్చిన అంశాల ఆధారంగా సర్వే చేసి వివరాలు నమోదు చేయాలి. సర్వేకు వెళ్లే సమయంలో వైద్య సిబ్బంది, వలంటీర్లు అపరిశుభ్ర వాతావరణం, దోమలకు ఆవాసాలుగా ఉన్న ప్రాంతాలు, నీటి కుంటలను గుర్తించాలి. వాటి తొలగించేలా అవగాహన కల్పించాలి. క్షేత్రస్థాయి అధికారులకు తెలియజేసి పారిశుధ్య పనులు చేయించేలా చూడాలి. –శ్రీనివాసులు, జిల్లా మలేరియా నివారణ అధికారి

గంజాయిపై పోలీసుల ఉక్కుపాదం



పలమనేరు : స్మగ్లర్ల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

- పలమనేరు సబ్ డివిజన్‌లో భారీగా కేసులు
- పది రోజుల్లో 35మంది అరెస్ట్

పలమనేరు: పలమనేరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో గంజాయి అమ్మకదారులు, వినియోగదారులపై పోలీసులు ఉక్కు పాదం మోపుతున్నారు. గత పది రోజుల వ్యవధిలో గంజాయి అక్రమ రవాణకు సంబంధించి 35 మందిపై కేసులు నమోదు చేసి, పలు ద్విచక్ర వాహనాలు, 50 కిలోల గంజాయి, 50 కిలోల గంజాయి మొక్కలను సీజ్ చేసినట్టు డీఎస్పీ సుధాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద 12 మంది గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేసి, వారినుంచి భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కుప్పంలో ఇద్దరు, వీకోట మండలంలో 12 మందిని అరెస్ట్ చేశామన్నారు. పుంగనూరు, గంగవరం, పలమనేరు మున్సిపాలిటీల్లో 11మందిని పట్టుకొని, కేసులు నమోదు చేశామని తెలిపారు. కేవలం పదిరోజుల వ్యవధిలో గంజాయి స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపి పట్టు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ సుబ్బారెడ్డి క్రైం పార్టీ సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

పూతలపట్టు మండలంలో ఇద్దరు అరెస్టు

పూతలపట్టు: గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. కల్లూరు సీఐ శ్రీనివాసులు వివరాల కథనం మేరకు.. పూతలపట్టు మండలం ఎం.బండపల్లె శివారుల్లో మంగళవారం ఉదయం 10.30 గంటలకు పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో ఒక ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా గంజాయి ఉంది. గంజాయిని తరలిస్తున్న ఎం.బండపల్లెకు చెందిన పూండి వెంకటేష్ (32), తపాల్ మోహన్ బాబు (50)ను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.15 వేల విలువజేసే 1.5 కేజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బండపల్లె నుంచి కాట్పాడికి తరలిస్తున్నట్లు నిందితులు తెలిపారు. నిందితులను రిమాండుకు తరలించారు. ఐరాల ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది కృష్ణయ్య శెట్టి, వినోద్, భవాని పాల్గొన్నారు.

యాదమరి మండలంలో ఇద్దరు అరెస్టు

యాదమరి: యాదమరి మండలం తమిళనాడు సరిహద్దులోని రంగనాయకుల గ్రామంలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు సీఐ రవిశంకర్ రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు..

జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులకు అందిన సమాచారం మేరకు మండలంలోని తమిళనాడు సరిహద్దులోని రంగనాయకులపురం గ్రామానికి చెందిన శివకుమార్(24), దండపాణి (36) గంజాయి విక్రయిస్తున్నారు. దీనిపై సమాచారం అందిన వెంటనే ఎస్‌ఐ సుమన్, డిప్యూటీ తహసీల్దార్ జయంతి, పోలీసు సిబ్బంది ఆ గ్రామానికి వెళ్లగా, శివారు ప్రాంతంలో శివకుమార్, దండపాణి ఉన్నారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా చిత్తూరు జానకారపల్లెకు చెందిన పార్థిబన్ భార్య వల్లియమ్మ వద్ద రూ.10 వేలు ఇచ్చి 2కిలోల గంజాయి కొనుగోలు చేసినట్లు వివరించారు. ఈ గంజాయిని బావివద్ద పొదల్లో దాచి చిన్నచిన్న ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నట్లు వివరించారు. మిగిలిన కిలో 500ల గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.

కేబీఆర్‌పురంలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

పుత్తూరు రూరల్: మండలంలోని కేబీఆర్‌పురం దళితవాడలో మంగళవారం బాంబ్ స్క్వాడ్ బృందం తనిఖీలు చేపట్టింది. దళితవాడకు చెందిన పరశురామ్(55) అనే వ్యక్తి సోమవారం పేలుళ్ల దాటికి మృతి చెందిన విషయం తెలిసిందే. నాటు బాంబు పేలి ఉంటుందన్న అనుమానంతో స్థానిక పోలీసులు మంగళవారం బాంబ్ డిస్పోజబుల్ (బీడీ) టీమ్, క్లూస్ టీమ్‌లను పిలిపించి కేబీఆర్‌పురం దళితవాడలో సోదాలు చేశారు. సోదాల్లో బీడీ టీమ్‌కు చెందిన పీరయ్య బృంద సభ్యులు, స్థానిక సీఐ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మృతుడు పరశురామ్ ఇంటి వద్ద తనిఖీ చేస్తున్న బాంబ్ స్క్వాడ్

ఇంటిని ఆక్రమించుకున్నారని ఫిర్యాదు

పలమనేరు: తాను 12 ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇంటిపై కొందరు వ్యక్తులు దౌర్జన్యం చేసి, సామాన్లను బయటికి విసిరేసి ఆక్రమించుకున్నారని పట్టణంలోని అయ్యాకన్ను వీధికి చెందిన శివరాణి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తాను ఉమ్మడి కుటుంబ సభ్యురాలినని, తన మరిదితో కలసి స్థలాన్ని కొని ఇంటిని నిర్మించుకున్నానని తెలిపారు. తన మరిది మృతి చెందాక అతని భార్య ఇంటిని నెల్లిపట్లకు చెందిన మహేష్‌కు విక్రయించిందని పేర్కొంది. మహేష్ కొందరిని తీసుకొచ్చి తన ఇంట్లోని సామగ్రిని బయటకు పడేసి తనపై దౌర్జన్యం చేశాడని ఫిర్యాదులో వివరించింది.

తండ్రి, కొడుకులపై పోక్సో కేసు

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): మండల పరిధిలోని ముక్కళత్తూరుకు చెందిన ఓ మైనర్ బాలికను వేధించిన కేసులో తండ్రీకొడుకులపై పోక్సో చట్టం కింద మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాం జనేయులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన వెంకటేష్, అతని కుమారులు వినోద్‌కుమార్, ఉదయ్‌కుమార్ కొన్ని రోజులుగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, తన సోదరిలను సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జాబ్‌మేళాలో 84 మందికి ఉద్యోగాలు



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

పలమనేరు: పట్టణంలోని శ్రీవర్రావెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 84మంది వివిధ ఉద్యోగాలను పొందారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ విజయశేఖరం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి చైతన్య మాట్లాడారు. కాగ్నెంట్ ఈ–సర్వీసెస్, ఎకార్ట్ లాజిస్టిక్స్, ఆజిల్ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్, రైస్ అండ్ షైన్ గ్రూపు ఆఫ్ కంపెనీస్, అమరరాజ బ్యాటరీస్ కంపెనీ ప్రతినిధులు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. ఈ మేళాకు 164మంది హాజరు కాగా, వీరిలో 84మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్లు హెచ్‌ఆర్‌లు పవన్, సిసింద్రీ తెలిపారు. అలాగే స్థానిక డిగ్రీ కళాశాలలో ఈనెల 24 నుంచి ఇక్కడి మహిళలు, యువతులకు ఉచితంగా బ్యూటీషియన్ కోర్సును ప్రారంభించనున్నట్లు వారు చెప్పారు.

నెలకు రూ.15వేలతో ఉద్యోగం



“ పేపర్లో చూసి జాబ్‌మేళాకు వచ్చాను. నేను బీకాం పూర్తి చేశాను. రైజ్ అండ్ షైన్ కంపెనీ నన్ను ఎంపిక చేసి ఉద్యోగం కల్పించింది. చాలా ఆనందంగా ఉంది. ఇంత సులువుగా జాబ్ దొరుకుతుందని అనుకోలేదు. –ఉహ, పలమనేరు

చాలా హ్యాపీ



డిగ్రీ చదివి ఖాళీగా ఉండం కన్నా ఏదో ఒక ఉద్యోగం వస్తే చాలని ఇంటర్వ్యూకు వెళ్లా. నా అదృష్టం కొద్దీ కాగ్నెంట్ సర్వీసెస్‌లో జాబ్ వచ్చింది. వారు ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం ఇస్తామన్నారు. చాలా హ్యాపీగా ఉంది. –చంద్రశేఖర్, పలమనేరు

నలుగురు జెడ్పీ ఉద్యోగుల సస్పెన్షన్

చిత్తూరు కార్పొరేషన్: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు జెడ్పీ కార్యాలయంలో నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విధులకు సమయానికి హాజరుకాక పోవడం, అనుమతి లేకుండ కార్యాలయం నుంచి వెళ్లడం, కోర్టు ఫైల్స్ నిర్వహణలో అలసత్వం, ఆర్డర్ కాపీ, ఫైల్స్ ప్రిపేర్ చేయడంలో పొరబాట్లు, జిల్లా కేంద్రంలో నివాసం ఉండకపోవడం వంటి కారణాలతో సూపరింటెండెంట్లు చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్, జూనియర్ సహాయకులు చంద్రబాబు, సతీష్‌ను సస్పెండ్ చేస్తూ జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పై పొరబాట్లను సరిదిద్దుకోవాలని గతంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు హెచ్చరికలు జారీ చేసినా వారిలో ఎటువంటి మార్పులు లేవు. సెలవు పెడితే కనీసం సమాచారం కూడ ఇవ్వడం లేదు. దీంతో వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీఈఓ వివరించారు.

నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. నివేదికలు, సర్వేపనులు గడువులోపు పూర్తి చేయాలని పేర్కొన్నారు.

నకిలీ డైమండ్ల పేరిట మోసం : ఇద్దరు అరెస్టు



నకిలీ వజ్రాలు

పలమనేరు: తక్కువ ధరకే రూ.10 లక్షల విలువజేసే అసలైన డైమండ్లను ఇస్తామంటూ నమ్మించి మోసం చేసేందుకు పథకం వేసిన ఇద్దరిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్టు సీఐ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని మండిపేటకు చెందిన చంద్ర అలియాస్ డేవిడ్ అదే గ్రామానికి చెందిన కన్నయ్యగౌడ్‌ను కలసి తన వద్ద అత్యంత విలువైన వజ్రాలున్నాయని, వీటి విలువ రూ.పది లక్షలు కాగా తక్కువ ధరకే ఇస్తానంటూ నమ్మించాడు. ఆపై పందేరుపల్లెలోని శ్రీనివాసులు వద్దకు తీసుకెళ్లి నకిలీ వజ్రాలను కన్నయ్యగౌడ్‌కు ఇచ్చాడు. నమ్మకం లేకుంటే ఎక్కడైనా చెక్ చేసుకోవచ్చని నమ్మకం కల్పించాడు. దీనిపై అనుమానం వచ్చిన కన్నయ్యగౌడ్ పోలీసులను ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన పోలీసులు చంద్ర అలియాస్ డేవిడ్(35), శ్రీనివాసులు(44)ను మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. నకిలీవి తయారు చేసి, వజ్రాలను కొన్నవారిపై పోలీసుల్లా దాడి చేసి డబ్బులు లాక్కోవాలని పథకం పన్నామని వారు విచారణలో అంగీకరించారు. దీంతో వీరిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.



నిందితుడు చంద్ర

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు



కామరాజు (ఫైల్)

తిరుమల : తిరుమలలో ఓ యువకుడి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలు.. ఈ నెల 14వ తేదీన శ్రీకాకుళం జిల్లా అమృత నగరం గ్రామానికి చెందిన కామరాజు (19) కుటుంబసభ్యులతో కలిసి తిరుమలకు వచ్చాడు. శ్రీవారి దర్శనానంతరం ఆలయం ఎదుట ఖాళీ స్థలంలో నిద్రించాడు. ఉదయం చూసేసరికి కామరాజు కనిపించలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు తిరుమల వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిస్తే 9440796771 నంబర్‌కు తెలియజేయాలని ఎస్‌ఐ సుధాకర్ కోరారు.

పోగొట్టుకున్న నగదు అప్పగింత

తిరుపతి అర్బన్: తిరుపతి బస్టాండ్‌లో ఈనెల 8న హోసూరుకు చెందిన ప్రయాణికుడు చిన్నరాజు రూ.14,500 నగదుతోపాటు ఓ సెల్‌ఫోను పోగొట్టుకున్నాడు. ఆర్టీసీ ఉద్యోగులు హనుమంతనాయుడు, కొండారెడ్డి ఆ నగదుతోపాటు సెల్‌ఫోన్‌ను గుర్తించి తిరుపతి డిపో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్ర నాయుడుకు అప్పగించారు. విచారణ చేసి చిన్నరాజుకు అందజేశారు.